ప్రజాశక్తి

బుధవారం 7 ఆగస్టు 2024

విజయవాడకు వైసిపి 'స్థానిక' ప్రజాప్రతినిధులు

ప్రత్యేక బస్సులో వైసిపి ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి. -చింతపల్లి: ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చింతపల్లి, జీకే వీధి మండలాల వైసిపి ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు మంగళవారం విజయవాడకు తరలివెళ్లారు ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, జెడ్పిటిసి పోతురాజు బాలయ్య ఉన్నారు. ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ స్థానంలో వైసిపికి స్పష్టమైన ఓటర్ల మెజారిటీ ఉన్నప్పటికీ, అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తరపున పోటీ అభ్యర్థిని బరిలో నిలుపుతుండడంతో, వైసిపి ఓటర్లను రక్షించుకునే పనిలో ఆ పార్టీ పడిందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

జిఒ 3, స్పెషల్ డిఎస్‌సిపై స్పష్టతనివ్వాలి

- 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలోగా సిఎం చంద్రబాబు ప్రకటన చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్
- జయప్రదానికి గ్రామాల్లో విస్తృత ప్రచారం

డుంబ్రిగుడలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు జిఒ3 చట్టబద్ధత, గిరిజన ప్రత్యేక డిఎస్‌సిపై స్పష్టతనివ్వాలని ఆదివాసీగిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గిరిజన విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో శతశాతం స్థానికులకే దక్కే జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దుచేసిన నేపథ్యంలో దాన్ని పునరుద్ధరిం చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన స్పెషల్ డిఎస్‌సిని ప్రకటించడంతోపాటు జిఒ 3 నిబంధనలకు అనుగుణంగా అన్ని పోస్టులను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని మారుమూల గ్రామాల్లో తాగునీరు, రోడ్డు ,విద్య, వైద్యం వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. గిరిజన ఆశ్రమాలు, కళాశాల లు కూడా మౌలిక సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు సరిపడే విధంగా బోధన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు పి సురేష్ కుమార్, పి సత్య నారాయణ, పి మత్తు, పి కుమారి, గిరిజనులు, కళాశాల గిరి విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈనెల 8న పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు గిరిజన ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గట్టు బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ .ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున జిఒ3 పై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు గత ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఉన్న అడవులను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రాజెక్టుల నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరారు.

సాగుదారులకు పోడుపట్టాలు పంపిణీ చేయాలని, 1/70, పీసా, గ్రామ సభ చట్టాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు టి జోషి, సత్యరావు, వెంకట్ కష్ణ రామస్వామిపాల్గొన్నారు.

అరకు రూరల్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం

చింతూరు : ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిఒ నెంబర్ 3, ఏజెన్సీలో ఆదివాసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆగస్టు 9న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. చింతూరులో గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వమైనా వాటిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, వీరబోయిన దిలీప్ నాగార్జున్, సుబ్బారావు, లక్ష్మణ్, తమ్మయ్య, బాబురావు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

రాజవొమ్మంగి: ఈ నెల 9న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజన ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ వంతు బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు ప్రజాప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు, బాలకృష్ణ మాట్లాడుతూ, రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా నిర్వహించే కార్యక్రమం జయప్రదంచేయాలన్నారు ఆదివాసీ జేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు వజ్రపు అప్పారావు, తొంట ఆదినారాయణ, కొండ్ల సూరి బాబు చీడి శివ, దాసరి పైడిమల్లు, పి రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

హుకుంపేట:ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహిం చాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు కోరారు. మండలంలోని ప్రభుత్వ కళాశాల, పాఠశాలల్లో ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయా లపై అవగాహన కల్పించారు. ఏజెన్సీ హక్కులు, చట్టాల కోసం అమలుకు గిరిజన ప్రజాప్రతి నిధులైన ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయా లన్నారు. ఈనెల 9న స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించ నున్నామని, అందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సోమన్న, లింగమూర్తి, రామారావు ఎన్.మూర్తి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పులి సంతోష్‌కుమార్

హుకుంపేటలో మాట్లాడుతున్న కృష్ణారావు

బిందు, సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

గిరి రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లు : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో సూక్ష్మసేద్యానికి ప్రభుత్వం తరుపున గిరి రైతులను అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన, ఇతర పంటలు సాగు చేసే గిరి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు వంటి సూక్ష్మ సేద్య పరికాలను రాయితీపై ఇవ్వనుందని, ఆసక్తి ఉన్న రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2024-25 అర్థిక సంవత్సరములో జిల్లాలో 1500 హెక్టార్లలో సూక్ష్మసేద్యం చేయడానికి లక్ష్యంగా నిర్ధేశించుకున్నామన్నారు. ఐదెకరాల లోపు భూమి గల రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 55శాతం రాయితీపై స్ప్రింక్లర్లు అందజేయనున్నామని, అలాగే ఐదెకరాల పైబడి ఉన్న రైతులకు 50శాతంరాయితీపై డ్రిప్ పరికరాలు, 45శాతం రాయితీపై స్ప్రింక్లర్లు అందజేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బోరు, బావి ఉన్న రైతులు తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు, అధిక నికర ఆదాయం సాధించడానికి సూక్ష్మ సేద్యం దోహదపడుతుందని కలెక్టర్ సూచించారు.

బిందు, సూక్ష్మ సేద్యంపై ఆసక్తి ఉన్న గిరిజన రైతులు ఆధార్ కార్డు, సాగు భూమికి సంబంధించి 1బి, బ్యాంకు పాసుబుక్ ప్రతులు, ఫోన్ నెంబర్ తదితర వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులనుగానీ మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ లేదా ఉద్యానవన అధికారిని గానీ కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఏడేళ్ల క్రితం రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు తీసుకున్న రైతులు కూడా ఈ ఏడాది రాయితీ బిందు సేద్యం పరికరాలు పొందడానికి అర్హులని తెలిపారు. పథకంపై మరిన్ని వివరాల కొరకు జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ ఎం.ఎ. రహీంను 7995087036 మొబైల్ నెంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

సంప్రదాయ వరిసాగుపై సూచనలు

పొలంబడిలో సాగు సూచనలు చేస్తున్న వ్యవసాయధికారి శ్రీనివాస్

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని అరడకోట పంచాయతీ తొట్లగొందిలో పొలంబడిలో భాగంగా సాంప్రదాయ వరిరకాల సాగుపై గిరిజన రైతులకు శిక్షణనిచ్చారు.ఈ మేరకు 30మంది సుసాగ్ చిరు ధాన్యాలు చెల్లెళ్ళ సంఘం సభ్యులకు చెందిన 25 ఎకరాలలో సాంప్రదాయ వరి రకాల సాగుకు 14 వారాలపాటు ప్రతి మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో మేలైన వ్యవసాయ సాగు పద్ధతులు వారికి వివరించి, ఆచరింప జేయడం ద్వారా నాణ్యత, ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఎఒ వివరించారు. ప్రతి మంగళవారం ఇచ్చే శిక్షణలో భాగంగా ఈ వారం వరినారు చిగుళ్లను తుంచి, నాట్లువేయడంతో కలిగే ప్రయోజనాలను వివరించి, నాట్లు వేయించారు.

కాగా గతేడాది మేలైన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించి, అధిక పంట దిగుబడులను సాధించడం ద్వారా అధిక నికర ఆదాయం వచ్చేలా చేసి, స్వయం సమృద్ధి పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకంలో మండలంలోని సిరిసపల్లి గ్రామంలో సుసాగ్ చిరు ధాన్యాలు చెల్లెళ్ళ సంఘం ఆధ్వర్యంలో 50 మంది రైతులకు రాగి పంట సాగుపై శిక్షణనిచ్చామన్నారు. ఇది సత్ఫలితమిచ్చి, సిరసపల్లి రైతులకు ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఇండ్‌గ్యాప్) సర్టిఫికెట్ పొందడంపై ఎఒ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొట్లగొంది రైతులకు ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ సాధనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

పసిబిడ్డల మృతిపై సమగ్ర విచారణ

ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఏజెన్సీలో పసిబిడ్డల వరుస మరణాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. పసి బిడ్డల మరణాలపై మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. చింతూరు మండలంలోని గంగన్నమెట్ట, సింగన్నగూడెం, చదలవాడ, బొడ్డుగూడెం, వంకగూడెం గ్రామాల్లో చిన్నారులు మరణించినట్లు తెలిపారు. శిశువుల మరణాలు బాధాకరమన్నారు. ఇందులో మూడు కేసుల్లో చిన్నారుల తల్లిదండ్రులు ఆర్‌ఎంపిల వద్దకు వెళ్లి నాటు వైద్యం చేయించినట్లు తెలిపారు. ఒకరికి పసర మందు పోశారన్నారు. మరో రెండు ఘటనల్లో క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తుందని చెప్పారు. వీటిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరదల కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఇకపై వైద్య సహాయం కోసం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం చింతూరు, కూనవరం, విఆర్.పురం ఎటపాక మండలాల్లో 0 నుండి 12 నెలల లోపు చిన్న పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు. మలేరియా సీజన్ కావడంతో ముందస్తు చర్యలుగా దోమల తెరలు, ఫాగింగ్ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటి వరకు వరదలు ఎక్కువగా ఉన్న విఆర్.పురం, కూనవరం మండలాల్లో దోమల తెరలు పంపిణీ చేశామని, చింతూరు, తులసిపాక పీహెచ్‌సీ పరిధిలో ప్రస్తుతం దోమల తెరలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు నాలుగు మండలాల్లో 400 టైఫాయిడ్ కేసులు, 245 మలేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. మెడికల్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఒ పుల్లయ్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

వరద బాధితులతో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

ఇటీవల గోదావరి, శబరి వరదల కారణంగా ముంపునకు గురైన గ్రామాల్లో వైద్యాధికారులు పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ముంపునకు గురైన మండలంలోని కోటారి గొమ్ము, జీడిగుప్ప, సీతంపేట, శ్రీరామగిరి, ముల్కనపల్లి, చొక్కానపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ, సిపిఎం నాయకులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి వారి బాధలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వరదలకు అనేక గ్రామాలు మునగటంతో గ్రామాల్లోని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, కాళ్ల వాపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఇద్దరు ముగ్గురు మరణించారని తెలిపారు. తక్షణమే వైద్యాధికారులు ఈ గ్రామాలను సందర్శించి సహాయ చర్యలు చేపట్టాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వరద ముంపులో 15 రోజుల పాటు ఇళ్లు ఉండడంతో పలు గృహాలు పడిపోయాయన్నారు. పూర్తిగా పడి పోయిన గృహాలకు రూ.2 లక్షలు, దెబ్బతిన్న ఇళ్లకు లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా పశువులు, మేకలు, గొర్రెలు వ్యాధులకు గురై మరణిస్తున్నాయని, పశువైద్యాధికారులు స్పందించి తక్షణమే హెల్త్ క్యాంపులు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు వాళ్ల కృష్ణారెడ్డి, కారం సుందరయ్య, సోడి మల్లయ్య, తోడం రాజు, కమ్మ చిచ్చు నారాయణ, గొంది దారయ్య, ఎ.కాంతారావు, జి.లక్ష్మణరావు, తాతబాబు రెడ్డి, ఎన్.రాజు, బాబురావు, మాజీ సర్పంచ్ బూబమ్మ, సున్నం సీతమ్మ, వార్డు మెంబర్ ఎన్.చంద్రరావు, టి.నాగేశ్వరావు, కొండారెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని మంగళవారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నది రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపైనా, ప్రస్తుతం ఆస్పత్రిలో ఎంతమంది రోగులు ఉన్నారు, ప్రతిరోజు ఎంతమంది ఓపి పేషెంట్లు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్ పరికరాలు మరమ్మతులు చేయించాలని సూచించారు. ఇంకా ఏమైనా పరికరాలు కావలసి ఉన్న జాబితా తయారు చేసి సమర్పించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా మందులు సరఫరాకు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏరియా ఆస్పత్రిని మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం డాక్టర్ వెంకట ఇందిరా, డాక్టర్ కల్పన, వైద్యాధికారులు ప్రేమ్ కుమార్, కిరణ్, కె.సుధాకర్, సుజన, మోబినా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి బురదమయం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-ఎటపాక

భద్రాచలం నుండి చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలకు రాకపోకలు సాగించే జాతీయ రహదారి బురదమయంగా మారింది. భద్రాచలం నుండి కుంట వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చోడవరం- వెంకటరెడ్డిపేట మధ్యలో జాతీయ రహదారి పల్లంగా ఉండటంతో అక్కడ మట్టి వేసి రోడ్డు ఎత్తు పెంచారు. ఈ పనులు జరిగి 6 నెలలైంది. మట్టి పోసి అలాగే ఉంచారు తప్ప ఇప్పటికీ తారురోడ్డు వేయలేదు. దీంతో చిన్నపాటి చినుకులు పడినా ఈ రోడ్డు చిత్తడిగా మారిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డులో ఒక వైపు నుండి వాహనాలు వెళ్తుంటే, మరో వైపు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బురద రోడ్డులో ప్రయాణం రాత్రి పూట మరింత ప్రమాదకరంగా మారనుంది. వర్షాలు పడితే మట్టి రోడ్డు ప్రమాదకరంగా మారుతుందని తెలిసి కూడా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేశారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఎత్తు పెంచే క్రమంలో ప్రమాణాలు పాటించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వెంకటరెడ్డి పేట వద్ద బురదమయంగా ఉన్న జాతీయ రహదారి

పాము కాటుతో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-చింతూరు

తమ్మయ్య మృతదేహం

పాము కాటుకు గురై మండలంలోని ఏజీ కోడేరు గ్రామానికి చెందిన గిరిజనుడు మంగళవారం మృతి చెందారు. ఏజీ కోడేరు గ్రామానికి చెందిన మోసం తమ్మయ్య (70) ప్రతి ఏటా వచ్చే వరదలు కారణంగా విఆర్.పురం మండలం బంగారుగూడెం సమీపంలోని తన సొంత పొలంలో ఇల్లు నిర్మించుకొని అక్కడ నివాసముంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న గడ్డిని తొలగిస్తుండగా, ఇప్పటికే అక్కడున్న త్రాచుపాము తమ్మయ్య కాలుపై కాటు వేసింది. ఇది గమనించిన కుటుంబీకులు పామును అక్కడే చంపి, తమ్మయ్య కాలుకు కట్టుకట్టి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విషం శరీర మొత్తం వ్యాప్తి చెందడంతో తమ్మయ్య అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. చికిత్స చేస్తుండగానే ఆయన మృతి చెందాడు. తమ్మయ్య భార్య గతంలోనే చనిపోయారు. ఆయనకు ముగ్గురు కొడుకులు ఉన్నారు.

హెల్మెట్ ప్రాధాన్యతపై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-రంపచోడవరం : హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజేస్తూ రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డి రవి కుమార్ సహకారంతో, ఎస్ఐ మోహన్ కుమార్ ఆధ్వర్యాన మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభించి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వల్ల ప్రమాదాల సమయంలో మరణాలను అరికట్టవచ్చని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ రవికుమార్ హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల్లో కదలిక

మండల సభలో సర్పంచ్ లేవనెత్తిన సమస్యకు అధికారుల స్పందన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని జర్రెల పంచాయతీ మండిభ, సెబ్బంపుట్టు, దేగలపుట్టు, జర్రెల తదితర గ్రామాల్లో జలజీవన్‌మిషన్ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయికృష్ణ, ఇతర సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో జర్రెల గ్రామపంచాయతీలో జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యంపై సర్పంచ్ భార్గవతి ప్రశ్నించి, నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో జాప్యం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అధికారులను నిలదీసి ప్రశ్నించారు. తక్షణమే దీనిపై చర్యలు చేపట్టకుంటే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల్లో కదలిక వచ్చింది. ఆ శాఖ ఎఇతోపాటు ఇతర సిబ్బంది మంగళవారం ఉదయం వర్షంలో జర్రెల పంచాయతీ పరిధిలోని గ్రామాలను పర్యటించారు జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. మండిభ, సెబ్బంపుట్టు, జర్రెల, దేగలపుట్టు, కాంగుబీది, సున్నం కోట, బిడిపుట్టు, మంచం రాయి , చెరువీధి, కొత్తూరు, గ్రామాలను పర్యటించి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగుబీది, బిడిపుట్టు, సున్నం కోట గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులపైనా దృష్టి పెట్టారు. మండలసభలో సర్పంచ్ సమస్యను లేవనెత్తడంతో అధికారులు స్పందించి, పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టడంపై పలువురు హర్షిస్తున్నారు. పనుల పరిశీలనలో ఆర్డబ్ల్యుఎస్ సిబ్బంది గణపతి, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి, గుత్తేదారుడు, దొంబు ఉన్నారు.

విజ్ఞానయాత్రలో పాల్గొన్న డిగ్రీ కాలేజ్ విద్యార్థులు

అల్లూరి నడయాడిన ప్రాంతాల సందర్శన

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు విజ్ఞానయాత్రలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన పలు ప్రాంతాలను సందర్శించారు. మంగళవారంకళాశాల ప్రిన్సిపల్ ఎం విజయభారతి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు కె.లీలావాని పర్యవేక్షణలో అల్లూరి సీతారామరాజు తుది శ్వాస విడిచిన మంప, కేడీపేట ప్రాంతాలను సందర్శించారు. కేడీపేటలోని అల్లూరి స్మారక ఉద్యానవనాన్ని సందర్శించి అల్లూరి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అశువులు బాసిన ఎందరో మహనీయుల జీవితగాథలను భావితరాలకు తెలియ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అల్లూరి త్యాగాలు, స్ఫూర్తి మాటల్లో చెప్పడం కాదని, ఆయన నడయాడిన ప్రాంతాలను విద్యార్థులు స్వయంగా సందర్శించి ప్రత్యేక అనుభూతి కలుగుతుందనే ఉద్దేశ్యంతో ఈ టూర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాటి త్యాగమూర్తుల స్ఫూర్తి ఆదర్శంగా తీసుకుని, సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని విద్యార్థులకు వివరించారు.

బ్యాంకు అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వెటర్నరీ డాక్టర్

పశుపోషకులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - అనంతగిరి : పాడిపశువులు, జీవాల పెంపకానికి రైతులకు రుణాలు మంజూరు చేసి ఆసరగా నిలవాలని కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు కోరారు. ఈ మేరకు దేవరాపల్లి యూకో బ్యాంకు అధికారులను కలిసి విన్నవించారు. కాశీపట్నం పశువైద్యకేంద్రం పరిధిలోని జీనబాడు, పెదకోట, పినకోట, కోటకివర్త పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజన రైతులకు పాడిపశువులు, జీవాలకు రుణాలు ఇవ్వాలని కోరారు. గత మార్చినెలలోనే దీనికి సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులను బ్యాంకర్లకు అందజేశామని, కానీ ఇప్పటి వరకు ఏఒక్కరికీ రుణం మంజూరు కాలేదని బ్యాంకు అధికారుల దృష్టికి వెటర్నరీ డాక్టర్ గణేశ్వరరావు తీసుకెళ్లారు. ప్రధానమంత్రి పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పశుపోషకులకు రుణాలతోపాటు పెట్టుబడి పాడి రైతులకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పినకోట గ్రామీణ పశు వైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి సుధారాణి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాత్కాలిక భవనం

ఐటిడిఎ పిఒ చొరవతో రేకుల షెడ్ ఏర్పాటు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : మండలంలో కరిముఖిపుట్టు గ్రామపంచాయతీ వెచ్చంగి ప్రాథమిక పాఠశాలకు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ చొరవతో తాత్కాలికంగా నిర్మించిన రేకుల షెడ్ భవనాన్ని మంగళవారం ఎంపిడిఒ కిరణ్‌కుమార్, ఎంఇఒ కృష్ణమూర్తి ప్రారంభించారు. వెచ్చంగి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని, పాఠశాల నిర్వహణకు వీలులేనంత ప్రమాదభరితంగా ఉండడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఐటిడిఎ పిఒ ప్రత్యేకంగా చొరవ తీసుకుని రూ.1.50లక్షలను కేటాయించారు. ఆ ప్రత్యేక నిధులతో తాత్కాలిక భవనమే అయినా పక్కా రేకుల షెడ్‌ను నిర్మించగా, దాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపిడిఒ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, వెచ్చంగి పాఠశాల దుస్థితిపై ఐటిడిఎ పిఒ స్పందించి, తాత్కాలిక రేకుల షెడ్‌కు ప్రత్యేక నిధులు మంజూరు చేయగా, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు శ్రమదానం చేసి నిర్మాణానికి సహకరించడం అభినందనీయమన్నారు. ఎంఇఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ, వెచ్చంగిలో పాఠశాల నిర్వహణకుఉపాధ్యాయులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఐటిడిఎ పిఒ స్పందించి ప్రభుత్వపరంగా ప్రత్యేక సాయం అందించి రేకులషెడ్ భవనం నిర్మించారన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఆర్ జెఇ మురళీకృష్ణ, సచివాలయ సెక్రెటరీ వరలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్, గ్రామ పెద్దలు ఆనందరావు, బుజ్జిబాబు, హెచ్‌ఎం జయరాం, ఉపాధ్యాయురాలు ఝాన్సీ, సర్పంచ్ భర్త అర్జున్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభంలో ఎంపిడిఒ, ఎంఇఒ

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఏపి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా దూర విద్యావిధానంలో టెన్త్, ఇంటర్‌లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని ఏరియా కోఆర్డినేటర్ జి గొన్ను తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో వన్ సిట్టింగ్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 944183 6580 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అంతరిక్ష పరిజ్ఞానంలో గణనీయ వృద్ధి

ప్రజాశక్తి -మధురవాడ : గడిచిన ఆరు దశాబ్దాలలో భారతదేశ అంతరిక్ష పరిజ్ఞానం గణనీయంగా వృద్ధి చెందిందని, ఖర్చు చేసిన ప్రతి పైసాకూ మూడింతలుగా ప్రయోజనం లభించిందని ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌ఎస్‌టి) ఛాన్సలర్ డాక్టర్ బివిఎ.సురేష్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మంగళవారం "సామాన్యుడి ప్రయోజనాల కోసం అంతరిక్ష పరిజ్ఞానం" అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు అంతరిక్ష ప్రయోగాలకు ఇంతటి దేశాలపై ఆధారపడిన భారతదేశం నేడు 34 దేశాలకు చెందిన 432 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించే స్థాయికి చేరుకుందన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 56 ఆపరేషనల్ శాటిలైట్స్ భారత అంతరిక్ష ప్రయోగశాల నుంచి ప్రయోగించడం విశేషమన్నారు. మరికొద్ది నెలల్లో జరగనున్న గగనయాన్ ప్రయోగం సహితం విజయవంతమవుతున్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ముర్రు పాలే శిశువులకు మొదటి టీకా

తల్లిపాల వారోత్సవాల్లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి- చింతపల్లి : తల్లి ముర్రుపాలే శిశువులకు మొదటి టీకా అని, వాటి ద్వారానే శిశువులకు జీవితకాల వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందనిస్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. ప్రసవానంతరం బాలింతలు మొట్టమొదటగా శ్రవించే లేత పసుపు వర్ణంలో ఉండే ముర్రుపాలను శిశువులకు విధిగా తాగించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సిడిపిఒ జివి రమణి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహారంపై సూర్యలక్ష్మి అవగాహన కల్పించారు. తహశీల్దార్ రామకృష్ణ, ఎటిడబ్ల్యుఒ జయ నాగలక్ష్మి, సిడిపిఒ రమణిలతో కలిసి ప్రాజెక్టు పరిధిలోని 25మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, ఇఒపిఆర్‌డిశ్రీనివాసరావు, ఎసిడిపిఒ రామలక్ష్మి, సూపర్వైజర్లు షేక్ గౌహరన్నీషా, విజయ్‌కుమారి, సత్యవతి, అప్పలనరస, గౌరీ, వైద్య సిబ్బంది,అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీలు పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని అన్నవరం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వైద్య శాఖ తరపున హెల్త్ విజిటర్ కృష్ణవేణి పాల్గొని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు ఆరోగ్యసూచనలు చేశారు.

పెదబయలు : తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, సూపర్ వైజర్స్, సిబ్బంది అశావర్కర్స్ కళాజాత బందం పాల్గొన్నారు

హుకుంపేట:స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు డాక్టర్ మోహన్ పాల్గొని, తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డకు చనుబాలు ఇవ్వడం ద్వారా తల్లీ బిడ్డలకు ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. గర్భిణులు,బాలింతలు, శిశువుల ఆరోగ్యపరిరక్షణకు తగు సూచనలు చేశారు. సిడిపిఒ సిహెచ్ బాలామణి దేవి పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించి, మాతాశిశు మరణాల నివారణకు గర్భిణులు, బాలింతలుగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు డాక్టర్ మోహన్, సిడిపిఒ బాలామణిదేవి స్వయంగా అన్నప్రాశన చేశారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

సీలేరు : తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని జికె.వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు ఆధ్వర్యాన మంగళవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఈ పాలు శిశువుల్లో వ్యాధి నిరోధక టీకా మాదిరిగా పనిచేస్తుందని చెప్పారు. శిశువులకు పూర్తిస్థాయిలో పాలు పెట్టాలంటే తల్లి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దారకొండ సర్పంచ్ రాజు, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులు బుజ్జి, పిహెచ్‌ఎన్ రాణి, ఎంపిహెచ్ఈఓ పోతురాజు, ఎంఎల్‌హెచ్‌పి లోవకుమారి పాల్గొన్నారు.

మారేడుమిల్లి : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చట్లవాడ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ప్రసూన, సరోజినీ, రాములమ్మ, ప్రేమమణి, మంగమ్మ, బాలమ్మ, రూపావతి పాల్గొన్నారు.

జి.మాడుగుల : మండలంలోని సొలభం అంగన్వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ ఐషరం హనుమంతరావు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్, ఉపసర్పంచ్ రాము, పీసా కమిటీ మత్స్య కొండబాబు, మహిళా పోలీస్ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

జి.మాడుగులలో....

దారకొండలో ర్యాలీలో డాక్టర్ హిమబిందు

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

సకాలంలో రేషన్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం, దేవీపట్నం : ప్రతి నెల తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. రంపచోడవరంలోని మండల స్థాయి స్టాక్ ఫైల్, దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలోని రేషన్ షాపును సబ్ కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ రేషన్ సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు. రేషన్ సరఫరాలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దారు చలపతిరావు, డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, జిసిసి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో ఎంఎంఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను జిల్లా అంతర్భాగ విద్య సమన్వయకర్త (ఎఎంఒ) కొమ్ము భాస్కరరావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వికలాంగుల కోసం క ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవిత విద్య కేంద్రాన్ని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న తీరు, విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. వికలాంగ విద్యార్థులతో మాట్లాడి విద్య అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్భాగ విద్యా వనరుల ఉపాధ్యాయులు పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.వీణాదేవి, అంతర్భాగ విద్యా వనరుల ఉపాధ్యాయులు తిత్తి చినబాబు, జ్యోత్స్న, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని వరద ముంపు గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ అధికారులు మంగళవారం పశువుల దాణా రైతులకు పంపిణీ చేశారు. వరదల వల్ల పశువులకు మేత దొరకడం లేదని అధికారులకు పలువురు నాయకులు తెలియజేయగా, ప్రభుత్వం పశు మిశ్రమ దాణా పంపించింది. దీనిని పశుసంవర్ధక శాఖ డాక్టర్ మాధవి లత ఆధ్వర్యంలో పశువులు ఉన్న ప్రతి రైతుకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం అమరావతిలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంపచోడవరం నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులపై శారీరక దండన తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులపై శారీరక దండనకు పాల్పడే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. నగరంలోని విశాఖ వ్యాలీ స్కూల్‌లో జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తరుచుగా బాలల భద్రత, రక్షణ, డ్రాపౌట్, బాల్య వివాహాలు, బాల కార్మికులు, డ్రగ్స్ నియంత్రణ మొదలగు బాలలకు సంబంధించిన అంశాలపై చర్చించి, సమస్యలను గుర్తించి. ఎలా ఎదుర్కోవాలో ప్రణాళిక తయారు చేయాలన్నారు.

తెగల సమన్వయంతో ఆదివాసీ దినోత్సవం నిర్వహణ

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

అన్ని గిరిజన తెగల సమన్వయంతో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని గిరిజన సంఘాలు, గిరిజన నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించి ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ 9న శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఉదయం 11.30 గంటలకు ఆదివాసీ జెండా ఎగరవేయడం జరుగుతుందని చెప్పారు. గిరిజన తెగల సంస్కృతిక సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఏడు తెగలకు ఏడు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే గిరిజనులకు భోజనం, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏడు తెగలకు సంబంధించి ఏడుగురు పెద్దలను సన్మానించనున్నట్లు చెప్పారు. మిగతా 6 మండలాల్లో ఆదివాసీ దినోత్సవం నిర్వహించడానికి మండలానికి రూ.10వేలు చొప్పున ఐటీడీఏ ద్వారా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంగల శ్రీనివాసరావుదొర, వెదుళ్ళ లచ్చిరెడ్డి, గొర్లె చిన నారాయణరావు, కడబాల సూరిబాబు, సమర్ధ కృష్ణ, తీగల బాబురావు, బుడమల మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, మడకం వరప్రసాద్ దొర, బి.వరప్రసాద్, వాస సత్యనారాయణ, ఎం వెంకటేశ్వరరావు, యల్.వెంకటేశ్వరరావు, కింటుకూరి లక్ష్మణరావు, పిహెచ్‌ఓ చిట్టిబాబు, ఐటీడీఏ పరిపాలన అధికారి డివిఎస్ రమణ, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కిషోర్, డిఈలు సాయి సతీష్, చైతన్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

గిరిజన చట్టాలు, జిఒల అమలుకు పోరాటం

ప్రజాశక్తి-విఆర్.పురం : గిరిజన చట్టాలు, జీవోలు పక్కాగా అమలు చేసేందుకు అధికారులను నిలదీసే విధంగా ఆదివాసీలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎంపిపి కారం లక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ చొక్కానపల్లి గ్రామంలో మంగళవారం తోడం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ, లక్ష్మి మాట్లాడుతూ జీవో నెంబర్ 3ను కోల్పోయిన ఆదివాసీ సమాజం, రానున్న కాలంలో గిరిజనుల జీవనాడులుగా ఉన్న 1/70 చట్టాన్ని, పీసా చట్టాలను కోల్పోతే ఆదివాసీల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. ఆదివాసీ సమాజం కోసం, భావితరాల కోసం ఉద్యమించాలన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న మండలంలోని రేఖపల్లి వద్ద జరిగే భారీ ర్యాలీలో ప్రతి గ్రామం నుండి గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు సోడి మల్లయ్య, కారం సుందరయ్య, కె.సత్యనారాయణ, ఏ.కాంతారావు, గొంది దారయ్య, జి లక్ష్మణరావు, ఎన్.చంద్రరావు, ఎన్.రాజు, బాబురావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బూబమ్మ, సున్నం సీతమ్మ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

9న పాఠశాలలకు సెలవు ఇవ్వాలి

విఆర్.పురం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈనెల 9న పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు పూనెం ప్రదీప్ కుమార్ వేటకాని మల్లయ్య డిమాండ్ చేశారు. రేఖపల్లి సెంటర్లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలను, జిఓ 3ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాయం రామారావు, సవలం రాజేంద్రప్రసాద్, కె.ముత్తయ్య, వేటకాని సూరిబాబు, కార్తిక్, బేతి ముత్తయ్య, సున్నం శేఖర్ పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఎటపాక : వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గన్నవరంలో గోదావరి వరదలకు దెబ్బతిన్న ఇళ్ళను మంగళవారం సిపిఐ నాయకులు పరిశీలించారు. అనంతరం క్రిష్ణవరం పంచాయతీ పరిధి భూపతిరావుపేట నిర్వహించిన సమావేశంలో విష్ణుమూర్తి మాట్లాడుతూ గోదారి వరదల్లో ఇళ్లు, పంటలు దెబ్బతిని ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వరదల వలన పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడిందని, పశువుల దాణాను సరిపడా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంటే రాజు, వార్డు సభ్యుడు సోయం కామేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, మాజీ ఎంపీటీసీ పసుపులేటి ముత్తయ్య, సోయం కాసులు, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ పవర్‌గా పీస్ వర్కర్లు

ఉత్తర్వులు జారీపై విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘం హర్షం

ప్రజాశక్తి -సీలేరు

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకుల కృషి ఫలితంగా ఎపి జెన్‌కో జల విద్యుత్ కేంద్రాల్లో పని చేస్తున్న పీస్ వర్కర్లను మ్యాన్ పవర్‌గా గుర్తిస్తూ ఏపీ జెన్కో యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్, గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.సుభాన్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ ఎపి జోన్‌కో సీలేరు కాంప్లెక్స్, మోతుగూడెం జల విద్యుత్ కేంద్రం పరిధిలో ఐదుగురు, సీలేరు జల విద్యుత్ కేంద్రం, డిస్ట్రిబ్యూషన్‌లో 12 మంది కాంట్రాక్ట్ కార్మికులు కొన్నాళ్లుగా పీస్ వర్కర్లుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి వచ్చే చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ గడవడం కష్టమయ్యేదని తెలిపారు. దీంతో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అనేక సార్లు విజయవాడ విద్యుత్ సౌదాలో సీఎండిని కలిసి పీస్ వర్కర్లను మ్యాన్ పవర్‌గా మార్చాలని వినతి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఇటీవల బదిలీ అయిన సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బి.శ్రీధర్‌కు స్టేట్ నాయకులు, బ్రాంచ్ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన పీస్ వర్కర్లను మ్యాన్ పవర్‌గా చేయాలని ఏపీ జెన్కో యాజమాన్యానికి లేఖలు పంపించినట్లు తెలిపారు. పీస్ వర్కర్లు పూర్వపరాలు పరిశీలించి ఏపీ జెన్కో యాజమాన్యం వారిని మ్యాన్ పవర్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

న్యాయం పక్షానే యూనియన్ పోరాడుతుందని, యూనియన్‌ను నమ్ముకున్న కార్మికులకు అన్యాయం జరగదని స్పష్టం చేశారు. పీస్ వర్కర్ల నుంచి మ్యాన్ పవర్‌గా మార్చినందుకు ఏపీ జెన్కో యాజమాన్యానికి, కృషి చేసిన యూనియన్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు యూనియన్ బలోపేతం చేయడానికి, కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నీట మునిగిన చేనుపాకల

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలం గొండోల పంచాయతీ చేనుపాకల గ్రామం వద్ద మద్దిగెడ్డ రిజర్వాయర్ నుండి అడ్డతీగల, తిమ్మాపురం వరకు వెళుతున్న మెయిన్ కెనాల్ పొంగడంతో చేనులపాక గ్రామం నీట మునిగింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరిగి కెనాల్ గట్టు పై నుండి పొంగిపోవడంతో చేనుపాకల గ్రామం పూర్తిగా నీట మునిగింది. దీనిపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన ఎవరూ స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు. దీంతో అడ్డతీగల తహశీల్దారు కార్యాలయానికి, పోలీసులకు సమాచారం ఇవ్వవడంతో మద్దిగెడ్డ రిజర్వాయర్ నుండి మెయిన్ కెనాల్‌కు వచ్చే నీరుని నిలుపుదల చేయడంతో వరద నీటి ప్రవాహం తగ్గి, మంగళవారం సాయంత్రానికి గ్రామంలో ముంపు తగ్గుముఖం పట్టింది. అయితే సంఘటన ఉదయం జరిగితే సాయంత్రానికి కూడా సంబంధిత అధికారులు ఎవరూ రాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా ఇరిగేషన్ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు.

నీటిలో ఉన్న చేనుపాకలలోని ఓ గృహం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. చెక్ పోస్టులు పెట్టాలని, పగలూ రాత్రీ అక్కడ సిబ్బందిని అందుబాటులో ఉంచి తనిఖీలు నిర్వహించాలని అన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. అనుమతులకు సంబంధించి సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.